


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | బుధవారం | 30-09-2026 | సంపుటి: 3 | సంచిక: 237 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 30-09-2026 | VOLUME : 3 | ISSUE : 237 | PAGES: 8 | COST: 2/- |



## రూ.2,700 మందుకు రూ.27 వేలా?

- క్యాన్సర్ మందుల ధరలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం
- రిటైలర్ ధరకు, ఎంఆర్‌పీకి పది రెట్ల వ్యత్యాసంపై ప్రశ్న
- సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలంటున్న ఆసుపత్రులపై ఆరా
- అక్టోబర్ 12కి తదుపరి విచారణ

4



## రేషన్ కార్డులపై కేంద్రం కీలక నిర్ణయం

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోని 1.58 కోట్ల మంది గుర్తింపు
- అక్టోబర్ 1 నుంచి కార్డుల ప్రయోజనాలు తాత్కాలికంగా నిలిపివేత
- అర్హత నిరూపణకు మూడు నెలల గడువు

4



## అల్వాల్ కేసులో డ్రగ్స్ కలకలం

- మైనర్‌పై లైంగిక దాడి కేసులో సంచలన విషయాలు
- నిందితులకు వైద్య పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్
- బాధితురాలికి మత్తు పదార్థాలు ఇచ్చినట్లు పోలీసుల గుర్తింపు
- డ్రగ్స్ సరఫరా మూలాలపై పోలీసుల ఆరా

2



# కేటీఆర్ కోటపై రేవంత్ గురి

- సిరిసిల్లలో నేడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- అభివృద్ధి పనులతో బీఆర్‌ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ దూకుడు
- భారీ బహిరంగ సభతో రాజకీయంగా కేటీఆర్‌కు సవాల్
- సిరిసిల్ల అభివృద్ధిపై వైట్‌పేపర్ విడుదల చేయాలన్న కేటీఆర్
- నేతన్నల సమస్యలు, భూముల ఆరోపణలపై అధికార, ప్రతిపక్షాల మాటల యుద్ధం

**హైదరాబాద్, సెప్టెంబర్ 29:**
బీఆర్‌ఎస్ అగ్రనేతల సొంత నియోజకవర్గాల్లో రాజకీయ పట్టు పెంచుకునే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. ఈ నెల 30న సిరిసిల్లలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతోపాటు భారీ బహిరంగ

మిగతా 2వ పేజీలో..

### నేడు కరీంనగర్ జిల్లాలో సీఎం పర్యటన

- ఏర్పాట్లపై రవాణా శాఖ మంత్రి పొన్నం సమీక్ష

2

### శివారు వెంకటాపూర్
## రైతులకు న్యాయం చేస్తా

- రైతులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి హామీ
- మా భూములను ఎర్రవెల్లి సర్వే నం.325లో కలిపారు
- సర్వే చేసి మా భూములు మాకు ఇప్పించండి
- మంత్రి పొంగులేటికి శివారు వెంకటాపూర్ గ్రామస్తుల వేడుకోలు

2





## పేదల కన్నీటికి విలువ కట్టలేం

- ఏడాది లోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం
- సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

2

## ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పనుల్లో ఆర్మీ సేవలు

- వారి నైపుణ్యంతో ప్రాజెక్టుల పునరుద్ధరణ మరింత పటిష్ఠం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

3

### నిమ్స్ డాక్టర్ బినామీలపై
## ఏసీబీ సోదాలు

- డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ ఆస్తుల కేసులో దర్యాప్తు
- హైదరాబాద్‌లో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు
- నిమ్స్ ఉద్యోగి ఇంట్లో రూ.4.94 లక్షల నగదు స్వాధీనం

3




## ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరో చిక్కు

- కేటీఆర్ సహా నలుగురి పాస్‌పోర్టులపై ఏసీబీ దృష్టి
- తాత్కాలిక జప్తునకు ఆర్‌పీవోకు ఏసీబీ కోర్టు లేఖ
- రూ.55 కోట్ల హెచ్‌ఎండీఏ నిధుల బదిలీపై కేసు
- ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసిన దర్యాప్తు సంస్థ
- అక్టోబర్ 30కి కేసు తదుపరి విచారణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 29:**
ఫార్ములాఈ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు కేసులోని మరో ముగ్గురు నిందితుల పాస్‌పోర్టులను తాత్కాలికంగా జప్తు చేసే ప్రక్రియ మొదలైంది. ఏసీబీ అభ్యర్థన మేరకు నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాసినట్లు తాజా కథనాలు వెల్లడించాయి. పాస్‌పోర్టులను తాత్కాలికంగా జప్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో..

### పప్పుధాన్యాల సాగు వృద్ధిలో
## రెండో స్థానం

- రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి తుమ్మల
- క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలి
- పామాయిల్ ధరపై కమిటీ వేస్తామన్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

3





## రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం

- హిందూ సమాజాన్ని విభజించేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- సీఎం వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ మండల కేంద్రాల్లో బీజేపీ నిరసనలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

3

## గాంధీ కుటుంబంపై రేవంత్ విధేయత




- రాహుల్‌ను ప్రధానిని చేయడమే తన లక్ష్యమన్న సీఎం
- దేశ భవిష్యత్తు 'గాంధీ పరివార్– సంఘ్ పరివార్' మధ్య పోరాటమని వ్యాఖ్య
- కేరళ వేదికగా చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- 'కుటుంబం ఫస్ట్' అంటూ రేవంత్‌పై బీజేపీ ఎదురుదాడి
- కాంగ్రెస్‌లోనూ సీఎం వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ

3



## ఫార్ములాఈ కేసులో కేటీఆర్‌కు మరో చిక్కు

**మొదటిపేజీ తరువాయి**

అందులో కోరినట్లు సమాచారం.

**రూ.55 కోట్ల బదిలీపై కేసు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములాఈ రేసుకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి సుమారు రూ.55 కోట్లను ఫార్ములాఈ ఆపరేషన్స్‌కు బదిలీ చేసిన వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. అవసరమైన అనుమతులు, ఆర్థిక విధివిధానాలు పాటించకుండానే నిధులు బదిలీ చేశారనేది ఏసీబీ అభియోగం. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ1గా, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా, మాజీ స్పోర్ట్స్ కన్సల్టెంట్ గోవెడ కిరణ్ మల్లేశ్వరరావును ఏ4గా పేర్కొంది.

**చార్జిషీట్ దాఖలు**

2024 డిసెంబర్‌లో కేసు నమోదు చేసిన ఏసీబీ దర్యాప్తు అనంతరం 2026 మార్చిలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కేటీఆర్‌తోపాటు ఇతర నిందితులు ఇప్పటికే కోర్టుకు హాజరయ్యారు. సెప్టెంబర్ 18న జరిగిన విచారణలోనూ కేటీఆర్, ఇతర అధికారులు నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. కేసులోని రెండు సంస్థల ప్రతినిధులు హాజరుకాకపోవడంతో తదుపరి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేశారు.

తాజాగా నిందితుల విదేశీ ప్రయాణాలను నియంత్రించే దిశగా పాస్‌పోర్టులపై ఏసీబీ చర్యలకు దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ తిరస్కరిస్తున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఫార్ములాఈ రేసును నిర్వహించామని, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు.

## శివారు వెంకటాపూర్ రైతులకు న్యాయం చేస్తా

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాతముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించగా ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన తుమ్మల సత్యానారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సచివాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శివారు వెంకటాపూర్‌లోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాతముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా మా భూములపై హక్కులు లేకుండా చేశారని, మా పొలాలు మాకు కాకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పటాలను రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద పాత పాస్‌బుక్కులు తీసుకున్నారని, కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి రికార్డులుపాత పాస్‌బుక్కులుగ్రామ నక్షాక్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. అలాగే దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగ రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం.. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డి.ఎస్.లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ కేసులో డ్రగ్స్ కలకలం

- మైనర్‌పై లైంగిక దాడి కేసులో సంచలన విషయాలు
- నిందితులకు వైద్య పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్
- బాధితురాలికి మత్తు పదార్థాలు ఇచ్చినట్లు పోలీసుల గుర్తింపు
- డ్రగ్స్ సరఫరా మూలాలపై పోలీసుల ఆరా
- సరఫరాదారుల నెట్‌వర్క్‌పై దర్యాప్తు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29:**

అల్వాల్‌లో మైనర్‌పై లైంగిక దాడి కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో అరెస్టయిన నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ వినియోగించినట్లు తేలినట్లు సమాచారం. బాధితురాలికి సైతం మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. డ్రగ్స్ మూలాలపై ఆరా సెప్టెంబర్ 9, 10 తేదీల్లో బాధితురాలిపై వేర్వేరు ప్రాంతాల్లో లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదైంది. నిందితులకు మత్తు పదార్థాలు ఎవరు సరఫరా చేశారు? ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. వారి ఫోన్లు, పరిచయాలు, డ్రగ్స్ సరఫరాదారులతో ఉన్న సంబంధాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కేసులో తొలుత ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు ఆ తర్వాత దర్యాప్తును విస్తరించారు. బాధితురాలికి మత్తు పదార్థాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉండటంతో లైంగిక దాడితోపాటు డ్రగ్స్ కోణంలోనూ ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులకు మత్తు పదార్థాలు చేరవేసిన వారిని గుర్తించడంపై ప్రస్తుతం దర్యాప్తు ప్రధానంగా సాగుతోంది.



# కేటీఆర్ కోటపై రేవంత్ గురి

**మొదటిపేజీ తరువాయి**

సభలో పాల్గొననున్నారు. సిరిసిల్ల జిల్లాలో దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. అయితే సీఎం పర్యటనలో నేరుగా చేపట్టే పనుల విలువపై వేర్వేరు గణాంకాలు ప్రచారంలో ఉన్నాయి.

**బీఆర్ఎస్ బలమైన ప్రాంతాలపై దృష్టి**

సిరిసిల్లలో కేటీఆర్ 2009 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఆయన సొంత నియోజకవర్గంలో భారీ కార్యక్రమం నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సిరిసిల్ల తర్వాత హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలోనూ కార్యక్రమాలు నిర్వహించే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ముఖ్య నేతలను వారి నియోజకవర్గాల్లోనే రాజకీయంగా ఎదుర్కొంటూ కాంగ్రెస్ క్షేత్రస్థాయి బలాన్ని పెంచుకోవాలన్న వ్యూహం ఇందులో కనిపిస్తోంది.

**అభివృద్ధే ప్రధాన అస్త్రం**

సిరిసిల్లలో నేతన్నల సమస్యలు, మౌలిక వసతులు, పెండింగ్ పనులను ముందుకు తెస్తూ గత బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించడం ద్వారా తమ ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. సీఎం పర్యటన సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభకు కాంగ్రెస్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

**కేటీఆర్ కౌంటర్**

సీఎం పర్యటనకు ముందే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. సిరిసిల్ల అభివృద్ధిపై వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి సీఎం చేసిన ఆరోపణలపై మండలం, గ్రామం, సర్వే నంబర్లు, విస్తీర్ణం సహా పూర్తి వివరాలను బయటపెట్టాలని సవాల్ విసిరారు. నేతన్నలకు ఉపాధి, ప్రభుత్వ ఆర్డర్లు, సంక్షేమ పథకాల అమలుపైనా సమాధానం చెప్పాలని కోరారు.

దీంతో సీఎం సిరిసిల్ల పర్యటన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ బలప్రదర్శనకు వేదికగా మారుతోంది. సుదీర్ఘకాలంగా కేటీఆర్‌కు బలమైన రాజకీయ స్థావరంగా ఉన్న సిరిసిల్లలో కాంగ్రెస్ తన పట్టును విస్తరించేందుకు ప్రయత్నిస్తుండగా, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది.

# రేపు కరీంనగర్ జిల్లాలో సీఎం పర్యటన

- ఏర్పాట్లపై రవాణా శాఖ మంత్రి పొన్నం సమీక్ష
- నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించనున్న సీఎం

**కరీంనగర్, సెప్టెంబర్ 29 :**



కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కరీంనగర్ జిల్లాలో బుధవారం పర్యటించనున్నారు. నూతనంగా నిర్మించిన కరీంనగర్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్‌ను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. నూతన కలెక్టరేట్ భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, అనంతరం నూతన సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి కలెక్టర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కలెక్టర్‌ను వారి ఛాంబర్‌లోని సీట్లో ఆశీనులను చేయిస్తారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధిపై జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ డెవలప్‌మెంట్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు

**కరీంనగర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది – మంత్రి పొన్నం**

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల ఆకాంక్షలకనుగుణంగా అభివృద్ధి జరగాల్సి ఉండె అని మంత్రి పొన్నం అన్నారు. గత పదేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల ఆశయాలకు తగిన ప్రాధాన్యత దక్కలేదని విమర్శించారు. గత పదేళ్లుగా శాతవాహన యూనివర్సిటీకి కనీసం వీసీనీ కూడా నియమించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, సంక్షేమం తదితర రంగాల్లో అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధితోపాటు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యావకాశాలను పెంచామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోటు లేకుండా ప్రజాపాలన ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని పెంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన వారికి రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతు భరోసా, రైతులకు బోనస్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 70 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టామని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టళ్లలో డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, గౌరవెల్లి, కలికోట సూరంపేట తదితర ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి పెట్టిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.250 కోట్లు కేటాయించామని, మిడ్ మానేరు ప్రాజెక్టు బాధితుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

**కరీంనగర్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి**

మానేరు రివర్ ఫ్రంట్, డంపింగ్ యార్డ్, కరీంనగర్ రింగ్ రోడ్డు తదితర కీలక అంశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో ఉన్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కరీంనగర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్లకు వెళ్లనున్నారు. డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించి అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. నేతన్నల సమస్యల పరిష్కారం, పాత బకాయిల చెల్లింపుతో పాటు చేనేత, పవర్‌లూమ్ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసాను ముఖ్యమంత్రి తన పర్యటన ద్వారా కల్పించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆర్మీ ఆయుధాల చోరీలో ఇద్దరు కీపర్ల అరెస్ట్

- మాజీ హవల్దార్ మల్లేశ్‌కు సహకరించినట్లు పోలీసుల గుర్తింపు
- ఆయుధాగారం కీపర్లు వినోద్, శేషు అదుపులోకి
- ముగ్గురి మధ్య ఆర్థిక లావాదేవీలకు సాంకేతిక ఆధారాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29:**

బొల్లారంలోని మద్రాస్ ఆర్మీ రెజిమెంట్ నుంచి ఆయుధాల చోరీ కేసులో దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ప్రధాన నిందితుడైన మాజీ హవల్దార్ మల్లేశ్‌కు ఆయుధాగారం కీపర్లు వినోద్, శేషు సహకరించినట్లు గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయుధాలను బయటకు తరలించడంలో వీరి పాత్ర ఉన్నట్లు దర్యాప్తులో ఆధారాలు లభించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలపై ఆరా ఆయుధాగారం నుంచి తుపాకులు, బుల్లెట్లను చోరీ చేసేందుకు మల్లేశ్‌తో కలిసి వినోద్, శేషు వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ముగ్గురి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సాంకేతిక ఆధారాలను సేకరించిన అధికారులు.. నగదు చెల్లింపులు, ఆయుధాల తరలింపుపై మరింత లోతుగా విచారిస్తున్నారు.

రెజిమెంట్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ ఇప్పటికే మల్లేశ్ నివాసంలో నిర్వహించిన సోదాల్లో పలు ఆయుధాలు, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న మల్లేశ్‌ను బొల్లారం మద్రాస్ రెజిమెంట్‌కు తీసుకెళ్లి చోరీ జరిగిన తీరుపై సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఆయుధాలు ఆర్మరీ నుంచి ఎలా బయటకు వచ్చాయి? ఈ వ్యవహారంలో మరెవరైనా పాత్ర ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.



# పేదల కన్నీటికి విలువ కట్టలేం

- ఏడాది లోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం
- సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 :**

తమది పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్టుమెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి మంత్రి పొంగులేటి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహానగరంలో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, సుమారు 1617 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**ఏడాదిలోపే ఇంటి తాళాలు**

ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్టుమెంట్ విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు, మూడు సంవత్సరాల సమయం తీసుకోకుండా ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం సర్టిఫికెట్లు ఇచ్చి వదిలేయకుండా అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమీషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం**

టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీని మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారిస్తామని చెప్పారు. వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం కల్పించి తమ ఇల్లు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారు.

**నగరానికి మధ్యలోనే ఇళ్లు కట్టిస్తాం**

గత ప్రభుత్వాలు నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 3040 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తున్నదని చెప్పారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాక ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎంపికైన 480 మందికి మంత్రి అభినందనలు తెలియజేశారు. లక్కీ డ్రాలో విజేతలైన లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి ఇళ్ల నెంబర్లు కేటాయిస్తూ వారి పేర్లను ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా మాదేసు లత అనే మహిళకు డ్రాలో ఇందిరమ్మ ఎ టవర్‌లోని 801 ఇంటిని కేటాయిస్తూ ప్రకటన చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :

ఓటమి భయంతో రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మండిపడ్డారు. రాముడు, శివుడిని వేరు చేస్తూ సమాజాన్ని చీల్చాలని చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు పార్టీలో చేరగా వారిని సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల బ్రిస్బేన్(ఆస్ట్రేలియా)లో ఇండియన్ కల్చరల్ సొసైటీ ఆహ్వానం మేరకు పర్యటించి వచ్చిన రామచందర్ రావును పార్టీ నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ ఎన్నికల ప్రక్రియను అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలే ప్రశంసిస్తూ, అధ్యయనం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యవస్థను, ప్రతిష్ఠను ప్రపంచ వేదికలపై కించపరుస్తోందని మండిపడ్డారు.

**'సర్'పై కాంగ్రెస్ నేతల ద్వంద్వ ప్రమాణాలు**

దేశవ్యాప్తంగా చేపట్టిన 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్, 'ఇండి' కూటమి తప్పుడు ప్రచారాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన, దొంగ ఓట్ల తొలగింపు, అసలైన ఓటర్లకు న్యాయం చేయడమే ఎసఐఆర్ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో 2018లో తెలంగాణ, రాజస్థాన్‌లలో ఓట్ల తొలగింపుపై అభిషేక్ మను సింఘ్వి, సచిన్ పైలట్, పశ్చిమ బెంగాల్‌లో జవహర్ సిర్కార్ వంటి కాంగ్రెస్, కూటమి నేతలే వేలాది దొంగ ఓట్లు ఉన్నాయని మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళం ఎన్నికల్లో 'సర్' ప్రక్రియ సక్రమంగా జరగడం వల్లే తమకు ప్రయోజనం కలిగిందని కాంగ్రెస్ నాయకుడు రమేష్ చెన్నితాల సైతం స్వయంగా అంగీకరించారని తెలిపారు.



**ఈసీఐ న్యూట్రాలిటీపై తప్పుడు ప్రచారం**

ఎన్నికల సంఘం సభ్యుల మధ్య విభేదాలున్నాయంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని రామచందర్ రావు తిప్పికొట్టారు. ఈసీఐ సభ్యుల మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, పరిపాలనాపరమైన స్పష్టత కోసమే నోట్ రాశారని ఇప్పటికే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి సంయుక్తంగా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో సుకుమార్ సేన్, కల్యాణ్ సుందరం, ఎస్పీ సేన్ వర్మ, నాగేంద్ర సింగ్, టి.స్వామినాథన్, ఆర్.కె.త్రివేది వంటి కమిషనర్లకు పదవీ విరమణ తర్వాత పదవులు, పద్మ పురస్కారాలు, గవర్నర్‌గిరీలు ఇచ్చి రాజ్యాంగ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసింది కాంగ్రెస్ పార్టీయేనని మండిపడ్డారు. ప్రధాని మోదీ హయాంలో పారదర్శకమైన ఎంపిక ప్రక్రియతో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.

**హిందూ దేవుళ్లను విభజిస్తున్న రేవంత్ క్షమాపణ చెప్పాలి**

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను వాడుకుంటూ సమాజాన్ని నిలువునా చీల్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బరితెగించారని రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. 'పేదవాడైనా, ధనికుడైనా ఏ కష్టమొచ్చినా రాముడిని, కృష్ణుడిని, శివుడిని, దేవుళ్లందరినీ స్మరిస్తామని గుర్తుచేశారు. భూముల అమ్మకాలు, భూదందాలతో వేల కోట్లు వెనకేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయి.. ఆయనకు ఎలాంటి కష్టాలూ లేవు కాబట్టే దేవుళ్లపై పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు' అని రామచందర్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను అవమానించడం ఇదే మొదటిసారి కాదన్నారు.

**రేవంత్ రెడ్డి 'రేవంతుద్దీన్' అయ్యారు**

రాహుల్, సోనియాలకు నెలవారీ ముడుపులు పంపిస్తూ వారి కనుసన్నల్లోనే రేవంత్ రెడ్డి ఈ విద్వేష ప్రచారానికి ఒడిగడుతున్నారని చెప్పారు. గతంలో స్వయంగా ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం అని బహిరంగంగా ప్రకటించిన రేవంత్ ఇప్పుడు కల్మాలు చదువుకుంటూ 'రేవంతుద్దీన్'గా మారిపోయారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉత్తరదక్షిణ బేధాలు, కులాల చిచ్చులు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు ఏకంగా హిందూ దేవుళ్ల మధ్య వైషమ్యాలు రగిల్చే స్థాయికి దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కోట్లమంది హిందువుల మనోభావాలను గాయపరచడమేనన్నారు. రాముడు, శివుడు ఒకటేనన్న కనీస సాంస్కృతిక స్పృహ, ఇంగితజ్ఞానం ముఖ్యమంత్రికి లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. రేవంత్ రెడ్డికి దేవుళ్లపై నమ్మకం లేకపోతే ఇంట్లో కూర్చోవాలి తప్ప అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు.

**ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసమే హిందూ వ్యతిరేక కుట్రలు**

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ముస్లిం ఓట్లను పొందేందుకే రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై విషం చిమ్ముతున్నారని రామచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరిగాయని దుయ్యబట్టారు. ఒకవైపు వక్ఫ్ బోర్డు భూములను అక్కున చేర్చుకుంటూ మరోవైపు దేవాదాయ శాఖ భూములను యథేచ్ఛగా అమ్ముకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఈరోజు బీజేపీలో చేరిన ప్రముఖ వైద్యులు, మానసిక నిపుణుల బృందాన్ని సీఎం వద్దకు పంపి ఆయనకు కౌన్సెలింగ్, చికిత్స ఇప్పించాల్సిన అవసరం ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు. దేవుళ్లపై నమ్మకం లేని, హిందూ సమాజాన్ని అవమానించే నాయకుల ఫ్లెక్సీలను ఇకపై ఏ ఆలయం ముందూ పెట్టనిచ్చేది లేదని హెచ్చరించారు. సీఎం వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో బుధవారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు రామచందర్ రావు ప్రకటించారు. సమావేశంలో పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్ట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీలో డాక్టర్ల చేరిక**

ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతి శర్మ, డాక్టర్ సుభాష్, డాక్టర్ రణ్వీర్ సింగ్ జీ, డాక్టర్ జీవిత రవిపాటి, డాక్టర్ పమేలా, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ శ్రీ నగేష్, డాక్టర్ హనుమంతరావు, తదితరులు పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి రామచందర్‌రావు సాదరంగా ఆహ్వానించారు.

# గాంధీ కుటుంబంపై రేవంత్ విధేయత

- **రాహుల్‌ను ప్రధానిని చేయడమే తన లక్ష్యమన్న సీఎం**
- **దేశ భవిష్యత్తు 'గాంధీ పరివార్–సంఘ్ పరివార్' మధ్య పోరాటమని వ్యాఖ్య**
- **కేరళ వేదికగా చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**
- **'కుటుంబం ఫస్ట్' అంటూ రేవంత్‌పై బీజేపీ ఎదురుదాడి**
- **కాంగ్రెస్‌లోనూ సీఎం వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ**

హైదరాబాద్, సెప్టెంబర్ 29:

గాంధీ కుటుంబంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూరులో సెప్టెంబర్ 25న జరిగిన ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటాన్ని 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' మధ్య పోరుగా అభివర్ణించారు. రాజకీయంగా తనకు వ్యక్తిగత లక్ష్యాలేవీ మిగల్లేదని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడటమే తన కల అని ప్రకటించారు.

**గాంధీ కుటుంబమే కేంద్రంగా..**

మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని రేవంత్ పేర్కొన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పదవులు, అధికారాన్ని త్యాగం చేశారని చెప్పారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం గాంధీ కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తన రాజకీయ ప్రయాణంలో జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు అనేక పదవులు చేపట్టానని, ఇక రాహుల్‌ను ప్రధానిగా చూడటమే తన రాజకీయ ఆకాంక్షగా పేర్కొన్నారు.

**బీజేపీ ఎదురుదాడి**

రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. కాంగ్రెస్‌కు కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమైతే, తమకు దేశ ప్రయోజనాలే ప్రధానమని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ఒక ముఖ్యమంత్రి ప్రజలకు అంకితభావంతో ఉండాలని, ఒక కుటుంబానికి కాదని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం కాంగ్రెస్ రాజకీయాలు ఒక కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయని ఆరోపించారు.

**రాజకీయంగా ఆసక్తికర చర్చ**

రేవంత్ వ్యాఖ్యల వెనుక ఉద్దేశాలపై రాజకీయ వర్గాల్లో భిన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కొద్దికాలంలోనే టీపీసీసీ అధ్యక్షుడిగా, అనంతరం ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్.. గాంధీ కుటుంబ నాయకత్వంపై తన విధేయతను బహిరంగంగా చాటుతున్నారని ఒక వర్గం విశ్లేషిస్తోంది. అయితే ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు లేదా పదవీ సమీకరణాలతో ముడిపెట్టేందుకు ప్రత్యక్ష ఆధారాలు లేవు.

మరోవైపు రేవంత్ వ్యాఖ్యలను కాంగ్రెస్‌పై విమర్శలకు బీజేపీ రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తోంది. 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యతో మొదలైన మాటల యుద్ధం ఇప్పుడు కుటుంబ రాజకీయాలు, జాతీయ ప్రయోజనాల చుట్టూ తిరుగుతోంది. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే తన లక్ష్యమంటూ రేవంత్ చేసిన ప్రకటనతో ఈ రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

# ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పనుల్లో ఆర్మీ సేవలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను మరింత పటిష్ఠంగా చేపట్టేందుకు భారత సైన్యంలోని ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అదనపు అధికారుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇంటిగ్రేటెడ్ హెడ్‌క్వార్టర్స్‌లోని మిలిటరీ సెక్రటరీ విభాగం ప్రభుత్వ ఎంపిక కోసం ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లను పంపింది. వారిలో లెఫ్టినెంట్ కల్నల్ సత్యదేవ్ సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ రంజిత్ ఎ.మీనన్, లెఫ్టినెంట్ కల్నల్ హెచ్.వి.భల్లా ఉన్నారు. అత్యంత సంక్లిష్టమైన సాగునీటి ప్రాజెక్టుల్లో వీరి సేవలను వినియోగించుకునేందుకు ముగ్గురినీ డిప్యుటేషన్‌పై తీసుకోవడాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోంది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల దిల్లీలో భారత సైన్యాధిపతి జనరల్ ధీరజ్ సేథ్‌ను కలిశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లతోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనుల ప్రాధాన్యాన్ని వివరించి, అనుభవజ్ఞులైన ఆర్మీ ఇంజినీరింగ్ అధికారులను డెప్యుటేషన్‌పై పంపాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆ ప్రతిపాదన వేగంగా ముందుకు సాగి ప్రభుత్వ పరిశీలన కోసం ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లను ఆర్మీ ప్రధాన కార్యాలయం పంపింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జనరల్ ధీరజ్ సేథ్ ఇద్దరూ పుణె సమీపంలోని ఖడక్వాస్లాలో ఉన్న ప్రతిష్ఠాత్మక నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ) పూర్వ విద్యార్థులు కావడంతో వారిద్దరి మధ్య సంస్థాగత అనుబంధం, పరిచయం ఉన్నాయి. ఉత్తమ్ ఎన్‌డీఏలో వైమానిక దళ విభాగంలో శిక్షణ పొంది అనంతరం భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా సేవలందించారు. జనరల్ ధీరజ్ సేథ్ ఆర్మీ విభాగంలో శిక్షణ పొంది ఆర్మ్‌డ్ కార్ప్స్‌లో నియమితులయ్యారు. ఆయన 2026 జూన్ 30న భారత సైన్యానికి 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు.

**సాయుధ దళాల సామర్థ్యంపై అత్యున్నత గౌరవం**

ఒక మాజీ సైనిక అధికారిగా భారత సాయుధ దళాల అధికారుల వృత్తి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, నిజాయతీ, క్రమశిక్షణ, సమస్యలను పరిష్కరించే సామర్థ్యంపై తనకు అత్యున్నత గౌరవం ఉంది.. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో, విపత్తుల సమయంలో, తీవ్రమైన సవాళ్లు ఎదురైన సందర్భాల్లో కూడా సమర్థవంతంగా పనిచేసేలా సైనిక అధికారులకు శిక్షణ ఇస్తారు. సాంకేతిక నైపుణ్యంతోపాటు నాయకత్వం, జవాబుదారీతనం, లక్ష్యసాధన దృక్పథం వారి ప్రత్యేకత అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంతో సుమారు రెండేళ్లుగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న కల్నల్ పరీక్షిత్ మెహ్రా సేవలతో కలిగిన అసాధారణ అనుభవం కూడా మరికొందరు ఆర్మీ అధికారుల సేవలను తీసుకోవాలనే నిర్ణయానికి ప్రధాన కారణమని మంత్రి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణంతోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ ప్రణాళికలతో కల్నల్ పరీక్షిత్ మెహ్రా సన్నిహితంగా పనిచేస్తున్నారు. ఆయన సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, అత్యంత సంక్లిష్టమైన పనులను సమన్వయం చేసే సామర్థ్యం నీటిపారుదల శాఖకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. కల్నల్ పరీక్షిత్ మెహ్రాతో కలిసి పనిచేసిన అనుభవం అసాధారణమైనది.. సాంకేతికంగా అత్యంత సంక్లిష్టమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అనుభవజ్ఞులైన సైనిక ఇంజినీర్లు ఎంతటి విలువను జోడించగలరో ఆయన సేవలు నిరూపించాయి.. ఆ అనుభవంతోనే మరికొందరు అధికారులను డెప్యుటేషన్‌పై పంపాలని ఆర్మీ చీఫ్‌ను కోరాం.. మా విజ్ఞప్తికి జనరల్ ధీరజ్ సేథ్, ఆర్మీ ప్రధాన కార్యాలయం అత్యంత సానుకూలంగా, వేగంగా స్పందించినందుకు కృతజ్ఞతలు అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న కార్యాచరణ ప్రకారం ముగ్గురు అధికారుల్లో ఒకరిని ఎస్ఎల్‌బీసీ సొరంగం రెండు వైపులా జరుగుతున్న తవ్వకం పనుల పర్యవేక్షణకు నియమించనున్నారు. సొరంగం లోపల తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలకు సమీపంలో చేపట్టే కార్యకలాపాలను కూడా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తారు. మిగిలిన ఇద్దరు అధికారులను మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎస్ఎల్‌బీసీ సొరంగం దేశంలోనే అత్యంత పొడవైన, సాంకేతికంగా అత్యంత క్లిష్టమైన సాగునీటి సొరంగ ప్రాజెక్టులలో ఒకటి. సుమారు 44 కి.మీ పొడవైన ఈ సొరంగంలో ఇప్పటికే దాదాపు 35 కి.మీ పని పూర్తయింది. మిగిలిన పనులను 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అధునాతన భూభౌతిక పరిశోధనలు, మరింత పటిష్ఠమైన వెంటిలేషన్, భద్రతా వ్యవస్థలు, పనుల నిరంతర నమోదు, క్షేత్రస్థాయిలో కఠినమైన పర్యవేక్షణతో పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. అదే సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను శాస్త్రీయంగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచించిన మట్టి, కాంక్రీట్, పునాదులకు సంబంధించిన పరీక్షలు తుది దశకు చేరుకున్నాయి. ఐఐటీ బాంబే, ఏఎ ఫ్‌ఆర్‌వై ఇండియా సంస్థలు పరీక్షల ఫలితాలను విశ్లేషించి, అవసరమైన నిర్మాణాత్మక పునరుద్ధరణ చర్యల కోసం తుది డిజైన్లను సిద్ధం చేస్తున్నాయి. గడువులో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తి చేయడంతోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తి భద్రతతో తిరిగి పనిచేసే స్థితికి తీసుకురావడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఉత్తమ్ స్పష్టం చేశారు. పనుల వేగం కోసం కార్మికుల భద్రత, ఇంజినీరింగ్ ప్రమాణాలు లేదా నిర్మాణాల దీర్ఘకాలిక స్థిరత్వం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సైనిక నేపథ్యం, సాయుధ దళాల వ్యవస్థలపై ఆయనకున్న అవగాహన, ఎన్‌డీఏతో ఉన్న సంస్థాగత అనుబంధం, రక్షణ రంగంలోని వృత్తిపరమైన పరిచయాలు రాష్ట్రంలోని అత్యంత క్లిష్టమైన మౌలిక సదుపాయాల పనులకు ప్రత్యేక నైపుణ్యాన్ని సమకూర్చుకోవడంలో ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.



# పప్పుధాన్యాల సాగు వృద్ధిలో రెండో స్థానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 :

పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగులో గత ఏడాది ఖరీఫ్ కంటే 36% అధికంగా సాగుచేసి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతితోపాటు రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను మంగళవారం జరిగిన జాతీయ రబీ సదస్సులో ఆయన వివరించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో 36% వృద్ధితో తెలంగాణ ముందు వరుసలో నిలిచిందన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో, కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు మొక్కజొన్న, జొన్నను ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) పరిధిలోకి తీసుకురావాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అనేక మండలాలు లోటు, తీవ్ర లోటు వర్షపాత పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాక మండలాల స్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని కోరారు. సూక్ష్మ సాగునీరు, రక్షిత సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ సాగు విషయంలో తెలంగాణ రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు సానుకూలంగా స్పందించారని చెప్పారు. రాష్ట్రంలో అదనంగా దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, సుమారు 72 వేల మంది కొత్త రైతులు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చారని వివరించారు. రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ధరలు ఎంతో ముఖ్యమని, రైతుల్లో నమ్మకాన్ని కొనసాగించేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. దిగుమతుల విధానం కూడా రైతులకు అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆయిల్‌పామ్ ధరలపై ప్రత్యేక కమిటీని నియమించి రైతుల సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తుమ్మల తెలిపారు. తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని ప్రస్తుతమున్న సుమారు లక్ష నుంచి రెండు లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా ప్రస్తుతం 16 కృషి విజ్ఞాన కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, అదనంగా 16 కృషి విజ్ఞాన కేంద్రాలను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఐసీఏఆర్‌ను కోరారు. కొడంగల్‌లో అగ్రి బిజినెస్ పార్క్, సెమీఅరిడ్ హార్టికల్చర్ క్రాప్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌లను సమర్పించిందని మంత్రి తెలిపారు. కీలకమైన ఈ రెండింటికి కేంద్రం సహకారం అందించాలని కోరారు. రైతులకు కేవలం విత్తనాలు, ఎరువులే కాక సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, శాస్త్రీయ సలహాలు, నీటి పొదుపు విధానాలు, వ్యవసాయ విస్తరణ సేవలు, మౌలిక వసతులు, నమ్మకమైన మార్కెట్లు అవసరమని మంత్రి పేర్కొన్నారు. పరిశోధన, వ్యవసాయ విద్య, విస్తరణ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే కొత్త సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వేగంగా చేరుతుందని తెలిపారు.






# నిమ్స్ డాక్టర్ బినామీలపై ఏసీబీ సోదాలు

- **డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ ఆస్తుల కేసులో దర్యాప్తు**
- **హైదరాబాద్‌లో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు**
- **నిమ్స్ ఉద్యోగి ఇంట్లో రూ.4.94 లక్షల నగదు స్వాధీనం**
- **మహేశ్వరంలో రూ.57 లక్షల విలువైన వ్యవసాయ భూముల పత్రాలు**
- **బంజారాహిల్స్‌లో రూ.2.70 కోట్ల ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్లు**

హైదరాబాద్, సెప్టెంబర్ 29:

నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఆయనతో సంబంధాలున్న అనుమానితులు, బినామీలుగా భావిస్తున్న వారి ఇళ్లలో హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. నగదుతోపాటు వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్, పెట్టుబడులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు నిమ్స్ ఉద్యోగి ధనరాజ్ ఇంట్లో రూ.4,94,394 నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు.. మహేశ్వరం ప్రాంతంలోని మూడు వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.57 లక్షలుగా అంచనా వేశారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో సుమారు రూ.2.70 కోట్ల విలువైన ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు కూడా లభించినట్లు ఏసీబీ తెలిపింది. పెట్టుబడులపైనా ఆరా నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డి.గణేష్ పేరుతో ఉన్న సుమారు రూ.20 లక్షల పెట్టుబడుల వివరాలతోపాటు మరో వ్యక్తి పేరుతో ఉన్న పెట్టుబడులను అధికారులు గుర్తించారు. రూ.3 లక్షల హ్యాండ్‌లోన్‌కు సంబంధించిన రసీదులను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తులు, పెట్టుబడులకు డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌తో ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై సెప్టెంబర్ 21న కేసు నమోదు చేసిన ఏసీబీ.. తాజా సోదాల్లో లభించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీల ఆధారంగా దర్యాప్తును కొనసాగిస్తోంది.



# 'డిజిటల్ అరెస్ట్'తో రూ.10 కోట్లు స్వాహా

- విజయవాడలో విశ్రాంత ఇంజినీర్‌కు సైబర్ కేటుగాళ్ల వల
- పోలీసు అధికారులమంటూ వీడియో కాల్స్‌తో బెదిరింపులు
- నాలుగు లావాదేవీల్లో రెండు ఖాతాలకు భారీగా నగదు బదిలీ
- బ్యాంకు ఖాతాల స్తంభనకు పోలీసుల చర్యలు

విజయవాడ, సెప్టెంబర్ 29:

'డిజిటల్ అరెస్ట్' పేరుతో సైబర్ నేరగాళ్లు విజయవాడకు చెందిన విశ్రాంత ఇంజినీర్‌ను రూ.10 కోట్ల మేర మోసం చేశారు. పోలీసు ఉన్నతాధికారులమంటూ వీడియో కాల్స్ చేసిన నిందితులు.. మనీలాండరింగ్, అక్రమ లావాదేవీల కేసుల్లో ఆయన పేరు ఉందని భయపెట్టారు. అరెస్టు చేస్తామంటూ బెదిరించి, విచారణ పేరుతో తమ ఖాతాలకు నగదు బదిలీ చేయించారు.

నాలుగు విడతల్లో రూ.10 కోట్లు నిందితుల బెదిరింపులతో ఆందోళనకు గురైన బాధితుడు నాలుగు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రెండు బ్యాంకు ఖాతాలకు రూ.10 కోట్లు బదిలీ చేశారు. అనంతరం వారి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

బ్యాంకు ఖాతాల స్తంభనకు చర్యలు కేసు నమోదు చేసిన పోలీసులు నగదు వెళ్లిన ఖాతాలను స్తంభింపజేసేందుకు చర్యలు చేపట్టారు. నగదు ఎక్కడికి మళ్లిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. చట్టంలో 'డిజిటల్ అరెస్ట్' అనే విధానం లేదని, పోలీసుల పేరుతో వీడియో కాల్స్ చేసి బెదిరించినా నగదు బదిలీ చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ర్యాగింగ్ కలకలం

- సెకండ్ ఇయర్ విద్యార్థిపై దాడి
- విద్యార్థుల బైఠాయింపు
- ఇద్దరు సీనియర్లను సస్పెండ్ చేసిన యాజమాన్యం

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 :

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఈఈఈ సెకండ్ ఇయర్ చదువుతున్న రుత్విక్‌పై నలుగురు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. నిన్న క్యాంపస్‌లో రుత్విక్‌పై దాడి చేసి గొంతు పిసికినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధిత విద్యార్థి కాలేజీ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని తోటి విద్యార్థులు ఆరోపించారు. దీంతో సెకండ్ ఇయర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

రుత్విక్ తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు జాతీయ రహదారి 161పై బైఠాయించి నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనతో కాలేజీ యాజమాన్యం స్పందించింది. ఘటనపై విచారణ చేపట్టి, ర్యాగింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసింది. ఈ ఘటనతో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ర్యాగింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

## 100 రోజుల్లో 60 వేల మంది
# విద్యార్థులకు పౌష్టికాహారం

- సయ్యద్ ముజావర్‌పేటలో ప్రపంచస్థాయి కేంద్రీకృత వంటశాల
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణ

సూర్యాపేట/హైదరాబాద్, సెప్టెంబర్ 29 :

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న వేలాదిమంది విద్యార్థులకు రోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం సయ్యద్ ముజావర్‌పేటలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాలను రాబోయే వంద రోజుల్లో అందుబాటులోకి తేవడానికి పనులు వేగవంతం చేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన సామాజిక బాధ్యత కింద అందిస్తున్న రూ.9.60 కోట్ల ఆర్థిక సహాయంతో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ (అక్షయపాత్ర) సహకారంతో నిర్మిస్తున్నారు.

**1,029 విద్యాసంస్థలకు సేవలు**

ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని మొత్తం 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతి పనిదినం తాజాగా తయారుచేసిన సమతుల పౌష్టికాహారాన్ని అందిస్తారు. సూర్యాపేట జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, వేములపల్లి మండలాలకు చెందిన 131 ప్రభుత్వ విద్యాసంస్థల్లోని 7,972 మంది విద్యార్థులకు కూడా ఈ వంటశాల నుంచే ఆహారం సరఫరా కానుంది.

**అధునాతన సాంకేతికత – నాణ్యమైన ఆహారం**

ఒకేచోట భారీస్థాయిలో ఆహారాన్ని సిద్ధం చేయడంతోపాటు నాణ్యతా పరీక్షలు, ప్యాకింగ్, రవాణా, పంపిణీ వ్యవస్థలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించనున్నారు. ఆహార భద్రత, పరిశుభ్రత, నిర్ణీత సమయానికి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. విద్యార్థులలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతోపాటు భారత చిరు ధాన్యాల పరిశోధన సంస్థ సహాయంతో శాస్త్రీయంగా రూపొందించిన చిరు ధాన్యాల (మిల్లెట్స్) వంటకాలను మెనూలో చేర్చనున్నారు.

**అధికారుల సమన్వయం – మంత్రి సమీక్ష**

రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ ప్రాజెక్టు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సింగరేణి సంస్థ, హరే కృష్ణ ఫౌండేషన్, సూర్యాపేట నల్లగొండ జిల్లాల యంత్రాంగాల మధ్య సమన్వయం వహిస్తున్నారు. ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేసేందుకు భవన నిర్మాణం, మౌలిక వసతులు, ప్రత్యేక రవాణా రూట్ ప్లాన్‌ను ఒకేసారి సిద్ధం చేస్తున్నామని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌లు వెల్లడించారు.

**కుటుంబాలకు ఆర్థిక ఊరట – బడి మానేసే రేటుకు చెక్**

రోజూ ఉదయమే నాణ్యమైన అల్పాహారం, పౌష్టికాహారం అందడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, అభ్యసన సామర్థ్యం పెరుగుతాయని భావిస్తున్నారు. అంతేకాక విద్యార్థుల హాజరు శాతం పెరగడానికి, బడి మానేసే (డ్రాపౌట్) సంఖ్య తగ్గడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని, రోజువారీ కూలిపై ఆధారపడే నిరుపేద కుటుంబాలకు, ముఖ్యంగా బాలికల పోషణకు ఈ కార్యక్రమం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

- మోడీ కీలుబొమ్మగా ఈసీఐ
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 :

కేంద్ర ఎన్నికల కమిషన్ చైర్మన్ జ్ఞానేష్ కుమార్‌పై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని, ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యూదిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం మంగళవారం జరిగింది. ఈ భేటీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షత వహించారు. గతంలో రాజీవ్ గాంధీ పౌరులకు ఓటు హక్కు కల్పిస్తే నేడు ప్రధాని మోడీ 'ఓటు రద్దు' కుట్రలతో ఆ హక్కును లాక్కుంటున్నారని ఖర్గే విమర్శించారు. ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం క్రమబద్ధంగా ధ్వంసం చేస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఈసీఐ తీరును తప్పుబడుతూ కాంగ్రెస్ ఐదు కీలక డిమాండ్లతో తీర్మానం ప్రవేశపెట్టింది. ఎన్నికల జాబితాలో చేసే మార్పులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని బహిర్గతం చేయాలని, అన్ని రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలను సకాలంలో అందజేయాలని తీర్మానం చేశారు. సీఈసీ చర్యలు ఏకపక్షంగా ఉన్నాయని సహ కమిషనర్లే పేర్కొన్న నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్ సీఈసీ పదవిలో కొనసాగడానికి అనర్హుడని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణపై ప్రతిపక్షాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కూడా తీర్మానించారు.




**ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలపై పోరాటం**

ఎన్నికల ప్రక్రియను నియంత్రించడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సీడబ్ల్యూసీ తీర్మానించినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ వెల్లడించారు. పార్టీ అంతర్గత వ్యవస్థ, రాబోయే రాజకీయ సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేష్ సహా పలువురు సీనియర్ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.

**కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలతో భేటీ**

సిడబ్ల్యుసి సమావేశంతో పాటు ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యాశాఖ మంత్రులతో ఖర్గే, రాహుల్ గాంధీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా రాష్ట్రాల్లో విద్యా విధానం అమలు, అక్షరాస్యత పెంపుదలపై సమీక్షించారు. సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితోపాటు కర్ణాటక, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు డి.కె.శివకుమార్, వి.డి.సతీషన్, సుఖ్వీందర్ సింగ్ సుఖు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులపై కేంద్రం కీలక నిర్ణయం

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోని 1.58 కోట్ల మంది గుర్తింపు
- అక్టోబర్ 1 నుంచి కార్డుల ప్రయోజనాలు తాత్కాలికంగా నిలిపివేత
- అర్హత నిరూపణకు మూడు నెలల గడువు
- ఈ-కేవైసీ, క్షేత్రస్థాయి పరిశీలనతో మళ్లీ యాక్టివేషన్
- డూప్లికేట్, అనర్హుల ఏరివేతే లక్ష్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో రేషన్ కార్డుల ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారుల కార్డులను అక్టోబర్ 1 నుంచి తాత్కాలికంగా డిసేబుల్ చేయనుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి సుమారు 1.58 కోట్ల మంది లబ్ధిదారుల రేషన్ ప్రయోజనాలు నిలిచిపోనున్నాయి. అయితే వారి పేర్లను వెంటనే డేటాబేస్ నుంచి తొలగించరు.

**మూడు నెలల్లో ఈ-కేవైసీ**

ఆరు నెలలుగా రేషన్ వినియోగించని కార్డులను 'సైలెంట్ రేషన్ కార్డులు'గా పరిగణించనున్నారు. తొలుత వాటిని తాత్కాలికంగా డిసేబుల్ చేసి, లబ్ధిదారులు తమ అర్హతను నిరూపించుకునేందుకు మూడు నెలల గడువు ఇవ్వనున్నారు. ఈ వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు ఈకేవైసీ పూర్తి చేస్తే కార్డును తిరిగి యాక్టివేట్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని అక్టోబర్ 1 నుంచి SMARTPDSలో అమలు చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది.

**డూప్లికేట్ల ఏరివేత**

డూప్లికేట్ కార్డులు, మరణించిన వ్యక్తుల పేర్లు, వలస వెళ్లిన వారు, ఇతర అనర్హుల కారణంగా పీడీఎస్‌లో జరిగే లీకేజీలను అరికట్టడమే ఈ చర్యల ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. ఆధార్ అనుసంధానం, డిజిటలైజేషన్, బయోమెట్రిక్ ధ్రువీకరణ, ఈకేవైసీ ద్వారా డేటాబేస్‌ను ప్రక్షాళన చేస్తోంది. 2024 నవంబర్ నాటికి డిజిటలైజేషన్, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ తదితర చర్యల ద్వారా సుమారు 5.8 కోట్ల రేషన్ కార్డులను పీడీఎస్ వ్యవస్థ నుంచి తొలగించినట్లు కేంద్ర ఆహార శాఖ తెలిపింది.



**నిపుణుల అభ్యంతరం**

అయితే రేషన్ తీసుకోకపోవడానికి కారణాలను ముందుగా పరిశీలించకుండా కార్డులను నిలిపివేయడం వల్ల నిజమైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన రాజేంద్రన్ నారాయణన్ అభిప్రాయపడ్డారు. సాంకేతిక సమస్యలు, వలసలు, రేషన్ డీలర్లతో ఇబ్బందుల కారణంగా కొందరు సరుకులు తీసుకోకపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారుల అర్హతను క్షేత్రస్థాయిలో ముందుగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# సీఈసీపై సీజేపీ సమరం.. ముంబైలో 'జైల్ భరో'

- అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో నిరసనకు సీజేపీ పిలుపు
- అనుమతి నిరాకరించిన ముంబై పోలీసులు
- 'జైల్ భరో ఆందోళన'కు అభిజీత్ దీప్కే పిలుపు
- స్థానికుల అభ్యంతరాలతో మరింత ఉద్రిక్తత
- నిరసనకు అనుమతి లేదని పోలీసుల స్పష్టీకరణ

ముంబై, సెప్టెంబర్ 29:

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న ముంబైలో నిరసన చేపట్టాలని నిర్ణయించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కు పోలీసుల నుంచి అనుమతి లభించలేదు. శివాజీ పార్క్‌లో భారీ ఆందోళన నిర్వహించాలని సీజేపీ నిర్ణయించగా.. అక్కడ సభలకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదని ముంబై పోలీసులు స్పష్టం చేశారు. దీంతో సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే 'జైల్ భరో ఆందోళన'కు పిలుపునిచ్చారు.

**స్థానికుల అభ్యంతరం**

పోలీసుల అభ్యంతరాలతో పాటు శివాజీ పార్క్ పరిసరాల స్థానికుల నుంచి కూడా నిరసనకు వ్యతిరేకత వ్యక్తమైనట్లు సీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. సీజేపీ ప్రతినిధులు అక్కడికి చేరుకున్న సమయంలో కొందరు స్థానికులు కార్యక్రమాన్ని నిర్వహించొద్దని కోరిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే, వారు నిజంగా స్థానికులేనా? లేక ఉద్దేశపూర్వకంగా అక్కడికి పంపించారా? అని సీజేపీ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సీజేపీ, ముంబై బీజేపీ తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో పరస్పర భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించాయి.



**పోలీసుల కారణాలివే..**

శివాజీ పార్క్ నివాస ప్రాంతంలో, సైలెన్స్ జోన్‌లో ఉండటంతో పాటు అక్కడి వినియోగంపై బాంబే హైకోర్టు 2013లో ఇచ్చిన తీర్పు, మహారాష్ట్ర ప్రభుత్వం 2016లో జారీ చేసిన మార్గదర్శకాలను పోలీసులు ప్రస్తావించారు. నిరసనకు అవసరమైన బీఎంసీ అనుమతి కూడా సమర్పించలేదని పేర్కొన్నారు. శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ రద్దీతో పాటు సమీపంలోని ఆస్పత్రులకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మరో ప్రదేశంలో కార్యక్రమం నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. ఇదిలా ఉండగా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఎస్ఐఆర్‌ను నిలిపివేయడం, 2025 జనవరి ఓటరు జాబితాను పునరుద్ధరించడం తదితర డిమాండ్లను సీజేపీ ముందుకు తెచ్చింది. అక్టోబర్ 2న ముంబై నుంచి దేశవ్యాప్త ఆందోళన ప్రారంభిస్తామని గతంలో ప్రకటించిన సీజేపీ.. పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో 'జైల్ భరో'కు పిలుపునిచ్చింది.

# రూ.2,700 మందుకు రూ.27 వేలా?

- ఎంఆర్‌పీపై సుప్రీం ఆగ్రహం
- క్యాన్సర్ మందుల ధరలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం
- రిటైలర్ ధరకు, ఎంఆర్‌పీకి పది రెట్ల వ్యత్యాసంపై ప్రశ్న
- సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలంటున్న ఆసుపత్రులపై ఆరా
- అన్ని మందులకూ 16 శాతం మార్జిన్ సాధ్యాసాధ్యాలపై కేంద్రానికి సూచన
- అక్టోబర్ 12కి తదుపరి విచారణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల మందుల ధరల్లో భారీ వ్యత్యాసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఔషధ ధరల నియంత్రణకు సంబంధించిన పిటిషన్లను విచారిస్తూ.. రిటైలర్‌కు రూ.2,700కే లభించే క్యాన్సర్ మందుకు రూ.27 వేల ఎంఆర్‌పీ ఎలా ఉంటుందని ప్రశ్నించింది. ఇలాంటి ధరల వ్యత్యాసాన్ని 'దోపిడీ'గా అభివర్ణించింది. ఆసుపత్రుల ఫార్మసీలపైనా ప్రశ్నలు ప్రైవేటు ఆసుపత్రులు రోగులను తమ సొంత ఫార్మసీల నుంచే మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేయాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారన్న వాదనలపైనా ధర్మాసనం ఆరా తీసింది. ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద చికిత్స పొందే రోగుల మందుల బిల్లులు చివరకు ప్రభుత్వ ఖజానాపైనే పడతాయని, అలాంటి పరిస్థితుల్లో ధరల నియంత్రణ అవసరాన్ని పరిశీలించాలని పేర్కొంది.



16 శాతం మార్జిన్‌పై కేంద్రానికి సూచన ఔషధాలపై ఏకరీతి మార్జిన్ విధించే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని ధర్మాసనం సూచించింది. అన్ని మందులకూ 16 శాతం మార్జిన్ వర్తింపజేయడం సాధ్యమా? అనే దానిపై ప్రభుత్వం ఆలోచించాలని కోరింది. అయితే ప్రస్తుత డీపీసీవో 2013 నిబంధనల్లో 16 శాతం మార్జిన్ అన్ని మందులకు వర్తించే సాధారణ పరిమితి కాదని స్పష్టత ఉంది. ఈ అంశంపై కేంద్రం సమగ్రంగా పరిశీలించనుంది. కేసు తదుపరి విచారణ అక్టోబర్ 12న జరగనుంది.





# జర్నలిస్టుల సమస్యలపై ఆందోళన తప్పదు

## టియుడబ్ల్యూజె కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి

**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఆందోళన బాట తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం మల్లాపూర్ లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏమాత్రం చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ లు వచ్చేలా సంఘం పాటుపడిందని స్పష్టం చేశారు. ఐక్యమత్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అతిపెద్ద సంఘంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం మన సంఘం ఎప్పుడు ముందుంటుందని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి డి వెంకట్ రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.మల్కయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాంప్రసాద్ శర్మ, కేసీ మోహన్, పంజాల శ్రీనివాస్ గౌడ్, అక్బర్, ఆదిమూలం శ్రీనివాస్, రంగు మల్లేష్, రమేష్, జిల్లా హెల్త్ కమిటీ కన్వీనర్లు కొలనుపాక చంద్రమౌళి, విజయ్ లు, టీయూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి సురేష్, ఉపాధ్యక్షులు రుద్రగోని నర్సింగ్, కోశాధికారి వేముల శంకర్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల తిరుపతిరెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జ్యోతిర్మయ చారి, ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, నియోజకవర్గంలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిజం పవిత్రమైన వృత్తి.. జర్నలిస్టులు నా బిడ్డలతో సమానం

## ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం బాన్సువాడలోని డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిహాజరయ్యారు.మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బాన్సువాడలో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో మరెక్కడా జరగలేదని పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులకు సమీపంలో ఉన్న బాన్సువాడలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించడం ఎంతోప్రయోజనకరమన్నారు. సీనియర్ జర్నలిస్టుల అనుభవాలను పంచుకోవడం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం, దాని ఆవిర్భావం, వార్తల విశ్వసనీయతపై జర్నలిస్టులు చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వార్తలు రాసేటప్పుడు వాస్తవాలను నిర్ధారించుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని కాపాడాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన హద్దులను పాటిస్తూబాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుగా పనిచేయడం కత్తి మీద సాము లాంటిదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను నిర్వహిస్తుంటే, జర్నలిస్టులు ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజల ముందుకు తీసుకెళ్లే కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి మాట్లాడే అంశాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజాప్రతినిధులు తప్పు చేసినప్పుడు వాటిని ఎత్తిచూపే బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు.వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. పత్రికల ద్వారా ప్రజలకు అనేక విషయాలు తెలుస్తాయని, జర్నలిజం పవిత్రమైన వృత్తి అని అన్నారు. జర్నలిస్టులు తన బిడ్డలతో సమానమని పేర్కొన్నారు.బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావంపై జర్నలిస్టులు రాసిన వార్తలను తాను చదివానని, జర్నలిస్టులు వార్తలు రాయడం తమ బాధ్యత కాగా, వాటిని చదివి తెలుసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా, మంగళవారం ఉదయం సమాచార హక్కు చట్టంపై దిలీప్ రెడ్డి జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. అనంతరం నేర వార్తలకు సంబంధించిన అంశాలపై గోవింద్ రెడ్డి శిక్షణ ఇచ్చారు.మధ్యాహ్నం సెషన్‌లో వార్తా కథనాలు, ప్రత్యేక కథనాల రచనపై దిశ ఎడిటర్ మార్కండేయ శిక్షణ అందించారు. అనంతరం ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, ఏ1, సోషల్ మీడియా అంశాలపై ముద్దం నరసింహ స్వామి జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డి, ఎస్ ఆర్ ఎన్ కె కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, టీజీ ఆగ్రో మాజీ చైర్మన్ కాసుల బాలరాజు, కామారెడ్డి టి యు డబ్ల్యు జే అధ్యక్షులు వీర మాచినేని రజనీ కాంత్, ఐ జే యు కౌన్సిల్ సభ్యులు సేపూరి వేణుగోపాల్ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఏ. లతీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి బైరి సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్లో పొదుపుకు కేరాఫ్ అడ్రస్

- ఆరు ఏళ్ళుగా కస్టమర్ల మనసులు గెలుచుకున్న 'సాగర్ సూపర్ మార్కెట్'




**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఇంటికి కావాల్సిన సరుకులు కొనాలా..? నాణ్యతతో పాటు డబ్బు కూడా ఆదా అవ్వాలా..? అయితే మీ కోసమే ఆదిలాబాద్ పట్టణ కేంద్రంలో గత ఆరు సంవత్సరాలుగా నమ్మకమైన సేవలు అందిస్తోంది 'సాగర్ సూపర్ మార్కెట్'. అధినేత సాగర్ ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్న ఈ సూపర్ మార్కెట్, కస్టమర్ల అవసరాలను గుర్తిస్తూ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులను అందిస్తూ జిల్లా ప్రజల మన్ననలు పొందుతోంది. మీ నెలవారీ సరుకుల కొనుగోలుపై భారీగా పొదుపు చేసుకునేందుకు సాగర్ సూపర్ మార్కెట్ ఒక సువర్ణ అవకాశం అని చెప్పవచ్చు. కిరాణా సామాగ్రి, నిత్యావసర వస్తువులు ఇలా ఇంటికి కావాల్సినవి ఒకేచోట లభిస్తాయి. దీంతో వినియోగదారుల సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. వినియోగదారుల సౌకర్యార్థం, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఈ సూపర్ మార్కెట్ పట్టణంలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో తన సేవలను విస్తరించింది. ప్రస్తుతం పట్టణ కేంద్రంలో 1 సాగర్ సూపర్ మార్కెట్ దస్నాపూర్ బ్రాంచ్, 2 సాగర్ సూపర్ మార్కెట్ భుక్తపూర్ బ్రాంచ్, 3 సాగర్ క్యాష్ అండ్ క్యారీ బ్రాంచ్ సీసీఐలో అందుబాటులో ఉన్నాయి. కేవలం డిస్కౌంట్లు మాత్రమే కాకుండా, గత ఆరేళ్లుగా తమకు అండగా నిలిచిన కస్టమర్ల కోసం సాగర్ సూపర్ మార్కెట్ యాజమాన్యం ప్రత్యేక లక్కీ డ్రాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా లక్షల రూపాయల విలువగల స్కూటీలు, బైక్లు, ఇతర విలువైన గృహోపకరణాలు, గిఫ్ట్ కూపన్లను భారీ బహుమతులుగా అందిస్తూ కస్టమర్లకు మరింత ఆనందాన్ని పంచుతోంది. స్మార్ట్గా షాపింగ్ చేసి, మీ నెలవారీ బడ్జెట్ను ఆదా చేసుకోవడానికి ఈరోజే మీ సమీపంలోని సాగర్ సూపర్ మార్కెట్ను సందర్శించండి. నాణ్యతకు నమ్మకమైన చిరునామాగా నిలిచిన సాగర్ సూపర్ మార్కెట్లో కొనుగోలు చేయండి.

# జాతీయ స్థాయికి ఎంపికైన గురుకుల విద్యార్థులు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో ఉప్పల్ వాయి గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు కే మల్లేష్ 100 మీటర్స్ లో పరుగు పందెంలో రజత పతకం, 1000 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం ఎ గణేష్, 100 & 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం ఎ దిల్సన్, లాంగ్ జంప్ లో రజత పతకం, కే ఆనంద్, జావలిన్ త్రోలో కాంస్య పతకం కే ప్రవీణ్,60 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పథకం సాధించి అక్టోబర్ నెల 23 నుండి 27 వ తేదీ వరకు తమిళనాడు చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం శివరాం తెలిపారు ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది పిడి మహేష్ పి ఈ టి గోపాల్, కోచ్ సురేష్, విద్యార్థులను అభినందించారు.

# సబ్‌సెంటర్‌లో ఏఎన్‌సీ డే కార్యక్రమం నిర్వహణ

## డాక్టర్ సురేష్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి సబ్‌సెంటర్ పరిధిలో ఏఎన్‌సీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, మందుల వినియోగం మరియు ప్రసవానికి ముందస్తు ప్రణాళికపై అవగాహన కల్పించారు.గర్భిణీలకు రక్తపోటు, బరువు, హిమోగ్లోబిన్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. అలాగే క్రమం తప్పకుండా ఏఎన్‌సీ పరీక్షలకు హాజరు కావడం, ఐరన్–ఫోలిక్ యాసిడ్ మాత్రలను సక్రమంగా తీసుకోవడం, టీకాలు వేయించుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా గర్భధారణ సమయంలో కనిపించే ప్రమాద సంకేతాలను గుర్తించి, వాటి విషయంలో వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతి గర్భిణీకి సురక్షితమైన ప్రసవం కోసం ముందస్తు బర్త్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా. రమ్యశ్రీ, ఆశా కార్యకర్తలు సవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో ఘనంగా గణేష్ నిమజ్జనం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో మంగళవారం రోజున గణేష్ నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు, 8 గణనాథుల ను యువజన సంఘాలు, యూత్ పిల్లలు గత 14 రోజులుగా భక్తిశ్రద్ధలతో గణనాథులకు పూజలు నిర్వహించి మంగళవారం రోజున డప్పు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా నృత్యాలు చేస్తూ, డోలల చప్పులతో వీధుల గుండా సాగనంపుతూ, చిన్నలు, పెద్దలు, మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని కన్నుల పండుగ చేశారు, అనంతరం గొల్లపల్లి చెరువులోకి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలకు, సహకరించిన యూత్ సంఘాలకు గ్రామ సర్పంచ్ అటికెల కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మర్రి మధుసూదన్, వి డి సి అధ్యక్షులు అటికల పెద్ద మల్లేష్ యాదవ్, పాలకవర్గ సభ్యులు రెడ్డి మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# కవితా పోటీల్లో ఉట్నూర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్ (ఉట్నూర్):** గురజాడ వెంకట అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆర్గనైజేషన్ ఆఫ్ గ్లోబల్లీ యునైటెడ్ టీచర్స్ సాహిత్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్లైన్ కవితా పోటీల్లో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీల్లో కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొని ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది. కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసి వివిధ వేదికలపై రాణించడం అభినందనీయమని కొనియాడారు. సాహిత్య కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆలోచనా పరిధిని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. లిటరరీ సమన్వయకర్త పి.కిషన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్య అభిరుచిని పెంపొందించేందుకు కళాశాల తరఫున నిరంతరం ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. తెలుగు అధ్యాపకుడు ఎ.కపిల్ మాట్లాడుతూ గురజాడ స్ఫూర్తితో విద్యార్థులు చక్కని భావాలతో కవితలు రాయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.సాయిప్రసాద్, ఎస్కె.ముజీబ్, జె.యోగలక్ష్మి, ఎస్.పెంటన్న, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వీడీసీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

## ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** గ్రామ అభివృద్ధి అని వీడీసీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో అక్రమ బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై డి.రాధిక సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అర్లి(కె) గ్రామానికి చెందిన చిత్తల వెంకట్ రెడ్డిను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి సుమారు రూ.3,29,190 విలువైన 454 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బరంపూర్ గ్రామానికి చెందిన ఆరుగురు వీడీసీ సభ్యులు బెల్ట్ షాపు నిర్వహణకు రూ.12లక్షలు డిమాండ్ చేసి, రూ.10వేలు అడ్వాన్స్ తీసుకున్నట్లు నిందితుడు వెల్లడించాడు. దీంతో వీడీసీ సభ్యులు కస్లాల ప్రతాప్, మెర్గు రంజిత్ రెడ్డి, పట్ల నర్సయ్య, మేకల బాపురావు, గణేష్ గౌడ్, మాధురి మల్లేష్ లపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గతంలోనూ అక్రమ వసూళ్లకు పాల్పడిన వీడీసీలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని, గ్రామాల్లో బెల్ట్ షాపులు, ఇసుక అక్రమ రవాణా, కల్లు దుకాణాల పేరుతో వసూళ్లకు పాల్పడితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై తలమడుగు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** జిల్లాలో పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్ల ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, సీసీఐ ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ రెండో వారంలో సీసీఐ, ప్రైవేట్ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిన్నింగ్ మిల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, రైతులను సంబంధిత మిల్లులకు ట్యాగింగ్ చేసే ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో మాయిశ్చర్ మీటర్లను సక్రమంగా వినియోగించేలా వీఓలు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులు, వీఓలు, గ్రేడర్లతో స్థానిక పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి తేమ శాతం కొలతల్లో పారదర్శకత పాటించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పత్తి రవాణాకు సంబంధించి ఆర్అండ్బీ, జాతీయ రహదారులు, గ్రామపంచాయతీ రహదారుల పరిస్థితిని సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో తూకం, షెడ్లు, నీరు తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుల్లో కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేసే ప్రాంతాలు, ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలు వంద శాతం పనిచేసేలా చూసి రికార్డులను భద్రపర్చాలని సూచించారు. పత్తి మిల్లుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు తప్పని సరిగా ఉండాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌కు వచ్చే రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. మార్కెట్ పరిసరాల్లో మున్సిపాలిటీ, జిన్నింగ్ అసోసియేషన్, సీఎస్ఆర్ నిధులతో సీసీ కెమెరాలు



ఏర్పాటు చేయాలని, సీజన్ పూర్తయ్యే వరకు రాత్రివేళ పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు, ఎన్ఓసీలు, అగ్నిమాపక పరికరాల పనితీరును తనిఖీ చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చే మహిళా రైతులకు ప్రత్యేక టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. మార్కెట్ సమీపంలోని ప్రాంతాల దృష్ట్యా రైతులు, మహిళలకు భద్రత కల్పించేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూజిల్లాలోని మార్కెట్ యార్డుల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. అనంతరం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ ని పలువురు రైతు సంఘాల నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ కొయ్యాడ ప్రణయ్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, సిసిఐ బ్రాంచ్ మేనేజర్ పునీత, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, కమిషన్ ఏజెంట్లు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతు సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ సెల్ నాయకులకు ఘన సన్మానం




**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ సెల్లో నూతనంగా నియమితులైన జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మల తిరుపతిగౌడ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో నూతన నియామకాలు చేపట్టారు. గంభీరావుపేట మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ యాసిన్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ హష్మీ, జిల్లా కార్యదర్శులుగా మహమ్మద్ యాదుల్లా, మహమ్మద్ ఇక్బాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన నాయకులను నిమ్మల తిరుపతిగౌడ్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ సెల్ నూతన నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజలతో మమేకమై పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని కోరారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాలని ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన నాయకులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

# సమన్వయంతోనే మండల ప్రగతి

## గ్రంథాలయ చైర్మన్ అనిల్కుమార్, ప్రత్యేక అధికారి నదీమ్



**రాజముద్ర న్యూస్, బెజ్జూర్:** మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.అనిల్కుమార్, మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ నదీమ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు వెల్లడించగా, సర్పంచులు తమ గ్రామాల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యా శాఖపై ఎంఈఓ సునీత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కుక్కుడా సర్పంచ్ చిరంజీవి స్పందిస్తూ ఎంపీయూపీఎస్ పాఠశాల భవనం ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్య శాఖపై పీహెచ్ఎన్ కమల మాట్లాడుతూ బెజ్జూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలతో పాటు పాముకాటు, రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే ఇటీవల తమ గ్రామంలో పాముకాటుకు గురైన ఆదివాసీ వ్యక్తికి సకాలంలో వైద్యం అందక మృతిచెందారని సర్పంచ్ చిరంజీవి పేర్కొన్నారు. మర్థిడి సర్పంచ్ మన్నెంపల్లి మల్లేష్ మాట్లాడుతూ తమ గ్రామంలోని 60 కుటుంబాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని తెలిపారు. సులుగుపల్లి సర్పంచ్ సోయం చిన్నయ్య మాట్లాడుతూ రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా కావడం లేదని, లూజ్ వైర్ల సమస్య పరిష్కరించలేదని పేర్కొన్నారు. అటవీ హక్కులపై ఎఫ్ఆర్ఓ శ్రవణ్కుమార్ మాట్లాడుతూ అడవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. మొగవెల్లి సర్పంచ్ కొడప శంకర్ స్పందిస్తూ అటవీ హక్కు చట్టం కింద సాగు చేసుకుంటున్న ఆదివాసీలతో పాటు దశాబ్దాలుగా నివసిస్తున్న గిరిజనేతరులకు కూడా హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, రెండో విడత ఇళ్లను త్వరగా మంజూరు చేయాలని కోరారు. బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి తమ రికార్డులను అధికారులు తీసుకెళ్లి అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతానని తెలిపారు. సులుగుపల్లి సర్పంచ్ సోయం చిన్నయ్య బెజ్జూర్లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరగా, స్థలం చూపిస్తే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ అనిల్కుమార్ హామీ ఇచ్చారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం పంపిణీపై సర్పంచులకు సమాచారం ఇవ్వడం లేదని ఏనుగుపల్లి సర్పంచ్ ఏనుక శ్రీహరి, ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, భవనాలు నిర్మించాలని పెద్దసిద్దాపూర్ సర్పంచ్ సెండె పద్మ కోరారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి పొన్నం సమీక్ష

- నేడు కరీంనగర్ నూతన కలెక్టరేట్ ప్రారంభించనున్న సీఎం రేవంత్రెడ్డి

**రాజముద్ర న్యూస్, కరీంనగర్:** కరీంనగర్లో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్రెడ్డి బుధవారం ప్రారంభించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ భవనం, పరిసరాలను సుందరంగా అలంకరించాలని, పరిశుభ్రత, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంతం, హెలిప్యాడ్, కలెక్టర్ ఛాంబర్, సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సీఎం పర్యటనలో భాగంగా నూతన కలెక్టరేట్ భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, అనంతరం సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. వివిధ అభివృద్ధి



కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

### అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

కరీంనగర్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, మౌళిక వసతులు, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, గౌరవెల్లి తదితర ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.



మానేరు రివర్‌ఫ్రంట్, డంపింగ్యార్డు, కరీంనగర్ రింగ్ రోడ్డు వంటి అంశాలు ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ, పారిశ్రామిక, విద్యా, వైద్య రంగాల్లో జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. కరీంనగర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లనున్నారని తెలిపారు. అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మందుల వృథాపై కలెక్టర్ ఆగ్రహం

## జైనూర్ సీహెచ్సీలో ఆకస్మిక తనిఖీ

**రాజముద్ర న్యూస్, జైనూర్:** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్సీ)ను జిల్లా కలెక్టర్ కె.హరిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగుల పరిస్థితులు, మందుల నిల్వలను పరిశీలించారు. మందుల స్టాక్ను తనిఖీ చేసిన కలెక్టర్.. మందులను సక్రమంగా వినియోగించకుండా నిల్వల్లోనే గడువు ముగిసి వృథా కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో అందుబాటులోకి వచ్చిన మందులను రోగులకు అవసరమైన సమయంలో వినియోగించాలని సూచించారు. మందుల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, గడువు ముగిసేలోపు అవసరమైన మందులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించిన ప్రతిఒక్కరూ సమయపాలన పాటిస్తూ విధులకు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



వైద్యులు, సిబ్బంది సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డులు, వైద్య విభాగాలు, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రోగులకు అవసరమైన



మందులు, మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగాలి

**రాజముద్ర న్యూస్, బోథ్:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని కాంగ్రెస్ బోథ్ మండల అధ్యక్షుడు మేరుగు భోజన్న కోరారు. బోథ్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఫేజ్–2 ప్రక్రియపై మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మార్పులుచేర్పులు, సవరణలను క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాలని అధికారులను కోరారు. నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాల నమోదు, సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బురుగుల మల్లేష్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్, బోథ్ మండల అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుత్రెడ్డి, వార్డు మెంబర్ సోహెల్, జల్పత్తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# బాక్సింగ్‌లో భారత్ జోరు..

- ఇద్దరు క్రీడాకారులకు తుదిపోరు అవకాశాలు
- ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలపై భారత్ కన్నుతుదిపోరుకు చేరిన పర్వీన్ హుడా, అంకుశ్ పంఘల్; నరేందర్‌కు కాంస్యం

## ఇద్దరికి ఫైనల్ బెర్త్



**నాగోయా, సెప్టెంబరు 29 :** 2026 ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు సత్తా చాటుతున్నారు. మహిళల 65 కిలోల విభాగంలో పర్వీన్ హుడా, పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ పంఘల్ సెమీఫైనల్స్‌లో అద్భుత విజయాలు సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. దీంతో ఇద్దరూ కనీసం రజత పతకాలను ఖాయం చేసుకున్నారు. మరోవైపు పురుషుల ం90 కిలోల విభాగంలో నరేందర్ బెర్వాల్ సెమీఫైనల్లో ఓటమి పాలై కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. మహిళల 65 కిలోల విభాగంలో పర్వీన్ హుడా చైనాకు చెందిన లీ షును 5–0తో ఓడించి ఫైనల్ బెర్త్ సాధించింది. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన పర్వీన్.. ఏకపక్ష పోరులో విజయం సాధించి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ పంఘల్ ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ప్రస్తుత 75 కిలోల ప్రపంచ ఛాంపియన్ ఫజ్లిద్దిన్ ఎర్కిన్‌బొయెవ్‌ను 4–1తో ఓడించాడు. ఈ విజయంతో ఆసియా క్రీడల్లో పురుషుల బాక్సింగ్ ఫైనల్‌కు చేరిన భారత ఆటగాడిగా ఎనిమిదేళ్ల తర్వాత అంకుశ్ నిలిచాడు. పురుషుల ం90 కిలోల విభాగంలో నరేందర్ బెర్వాల్ కజకిస్థాన్‌కు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఐబెక్ ఒరల్‌బేతో జరిగిన సెమీఫైనల్లో ఓటమి పాలయ్యాడు. దీంతో నరేందర్‌కు కాంస్య పతకం దక్కింది. సెమీఫైనల్ చేరడం ద్వారా ముందుగానే పతకం ఖాయం చేసుకున్న నరేందర్.. స్వర్ణ పతక పోరుకు మాత్రం అర్హత సాధించలేకపోయాడు. పర్వీన్ హుడా, అంకుశ్ పంఘల్ విజయాలతో ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణ పతకాల అవకాశాలు లభించాయి. వీరిద్దరూ అక్టోబరు 2న జరిగే ఫైనల్స్‌లో బరిలోకి దిగనున్నారు.




## చరణి చరిత్ర.. టీ20 ర్యాంకింగ్స్‌లో
# సరికొత్త రికార్డు

**దుబాయ్, సెప్టెంబరు 29 :** భారత యువ ఎడమచేతి వాటం స్పిన్నర్ శ్రీ చరణి ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. తాజాగా విడుదలైన ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లోనే అత్యుత్తమంగా 817 రేటింగ్ పాయింట్లకు చేరుకున్న చరణి.. మహిళల టీ20 బౌలింగ్‌లో అత్యధిక రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్ 2018 నవంబరులో సాధించిన 806 పాయింట్ల రికార్డును ఆమె అధిగమించింది. జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో చరణి అద్భుతంగా రాణించింది. జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4/10తో కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసింది. అనంతరం శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులో రెండు వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో భాగమైంది. ఈ ప్రదర్శనతో ఆమె ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మరో భారత స్టార్ దీప్తి శర్మ కూడా సత్తా చాటింది. ఆసియా క్రీడల ఫైనల్లో మూడు వికెట్లు తీసిన ఆమె 754 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ 723 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన కూడా టాప్–5లోకి తిరిగి వచ్చింది. ఆసియా క్రీడల స్వర్ణ పతక మ్యాచ్‌లో శ్రీలంకపై 79 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడటంతో ఆమె ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సాధించింది. ఆసియా క్రీడలు, అంతకుముందు ఆసియా కప్‌లోనూ భారత మహిళల జట్టు తరఫున చరణి కీలక ప్రదర్శనలు చేసింది. ఆసియా కప్‌లో 12 వికెట్లు తీసిన ఆమె.. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 4/20తో అదరగొట్టి భారత్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.

# గుల్వీర్ సింగ్ సంచలనం.. హ్యాట్రిక్ పతకాలతో రికార్డు!

- ఆసియా క్రీడల్లో భారత్‌కు మూడు పతకాలు అందించి రికార్డు సృష్టించిన అథ్లెట్
- పురుషుల 5,000 మీటర్ల పరుగులో కాంస్యం గెలిచిన గుల్వీర్
- గతంలో 1,500, 10,000 మీటర్లలోనూ రజత పతకాలు సొంతం
- ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో మూడు పతకాలు సాధించిన పి.టి. ఉష సరసన చేరిన యోధుడు
- 13:32.75 నిమిషాల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి పోడియంపై భారత్ జెండా






ఆసియా క్రీడల వేదికపై భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ చారిత్రాత్మక ప్రదర్శనతో సంచలనం సృష్టించాడు. జపాన్‌లోని నాగోయా వేదికగా సాగుతున్న క్రీడల్లో భాగంగా మంగళవారం జరిగిన పురుషుల 5,000 మీటర్ల పరుగు ఫైనల్లో అతడు కాంస్య పతకాన్ని సాధించి, ఈ ఆసియా క్రీడల ఎడిషన్‌లో తన ఖాతాలో మూడో పతకాన్ని జమ చేసుకున్నాడు. ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో ఏకంగా మూడు పతకాలు సాధించిన అతికొద్ది మంది భారత అథ్లెట్ల సరసన గుల్వీర్ నిలవడమే కాకుండా, తన అద్భుతమైన పరుగుతో విశ్వవేదికపై భారతదేశ కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగురవేశాడు. పోటీ ఆద్యంతం అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన పురుషుల 5,000 మీటర్ల ఫైనల్ రేసులో గుల్వీర్ సింగ్ 13:32.75 నిమిషాల టైమింగ్ నమోదు చేసి మూడో స్థానంలో నిలిచాడు. ప్రారంభం నుంచి వ్యూహాత్మకంగా పరిగెత్తిన అతడు, రేసు చివరి ల్యాప్‌లో అనూహ్యంగా పుంజుకుని ప్రత్యర్థులను దాటుకుంటూ కాంస్య పతకాన్ని ముద్దాడాడు. గుల్వీర్ ఇప్పటికే ఈ క్రీడల్లో 1,500 మీటర్ల విభాగంలోనూ, అలాగే 10,000 మీటర్ల సుదీర్ఘ పరుగు విభాగంలోనూ రజత పతకాలను గెలుచుకున్నాడు. తాజాగా సాధించిన కాంస్యంతో అతడి పతకాల సంఖ్య మూడుకు చేరింది. ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో 1,500, 5,000 మరియు 10,000 మీటర్ల తరహా భిన్నమైన, కష్టతరమైన విభాగాల్లో పతకాలు సాధించడం గుల్వీర్ శారీరక దారాఢ్యానికి, నిలకడైన ప్రదర్శనకు నిదర్శనంగా నిలిచింది. గతంలో భారత క్రీడా దిగ్గజం పి.టి. ఉష మాత్రమే ఒకే ఆసియా క్రీడల్లో మూడుకు పైగా పతకాలు సాధించగా, ఇప్పుడు గుల్వీర్ సింగ్ ఆమె సరసన చేరి ప్రత్యేక ఘనతను సొంతం చేసుకున్నాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత అథ్లెటిక్స్ స్థాయిని పెంచిన గుల్వీర్ సింగ్ తాజా విజయంపై దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యశస్వి, వైభవ్..
# ఇద్దరి ఎదురుచూపు ఒకటే

**ముంబై, సెప్టెంబరు 29 :** ప్రతిభ, ఫామ్ ఉన్నప్పటికీ భారత జట్టులో తుది ఆటగాళ్ల జాబితాలో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ ఆటగాళ్లలో యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ నిలుస్తున్నారు. ఫార్మాట్లు వేర్వేరైనా.. ఇద్దరూ రాజస్థాన్ రాయల్స్‌కు ఓపెనర్లుగా ఆడుతుండటం, జాతీయ జట్టులో అవకాశం కోసం వేచి చూడాల్సి రావడం ఆసక్తికరంగా మారింది. జట్టులో తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో అవకాశాలు వచ్చినప్పుడు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని కోచింగ్ సిబ్బంది సూచిస్తున్నారు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ యశస్వి పరిస్థితిపై స్పందించాడు. జట్టులో స్థానాల కోసం తీవ్ర పోటీ ఉందని, యశస్వి అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడని పేర్కొన్నాడు. ఇప్పటివరకు అవకాశం లభించిన సందర్భాల్లో అతడు బాగా ఆడాడని, అతడికి ఎలాంటి అన్యాయం జరగడం లేదని స్పష్టం చేశాడు. కష్టపడి పనిచేస్తూ అవకాశం కోసం వేచి ఉండాలని సూచించాడు. యశస్వి గతంలో స్వదేశంలో అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కాలేదు. ప్రస్తుతం వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. తుది జట్టులో స్థానం మాత్రం పోటీతో కూడుకున్నదే. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ వంటి ఓపెనర్లు ఉండటంతో యశస్వికి అవకాశాలు పరిమితమవుతున్నాయి. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి అతడి పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. టీ20 క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీకి ఇదే తరహా పరిస్థితి ఎదురవుతోంది. అఫ్గానిస్థాన్‌తో స్వదేశీ టీ20 సిరీస్‌కు జట్టులో ఎంపికైనప్పటికీ తుది జట్టులో అవకాశం రాలేదు. అప్పట్లో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్.. వైభవ్‌కు ఇంకా చాలా సమయం ఉందని, అవకాశం వచ్చినప్పుడు తగినంత సమయం ఇస్తామని చెప్పాడు. ప్రస్తుతం టీ20 జట్టులో సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు ప్రాధాన్యం ఉండటంతో వైభవ్ తన వంతు అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. ఫార్మాట్ వేరైనా యశస్వి, వైభవ్ ఇద్దరి ఎదురుచూపు మాత్రం ఒకేలా కనిపిస్తోంది.




# ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం

## మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో అద్భుత విజయం

ఆసియా క్రీడల అథ్లెటిక్స్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో కిరణ్ పహల్, పూవమ్మ మాచెట్టిరా, ప్రాచి, విద్య రామరాజ్‌లతో కూడిన భారత బృందం 3:29.69 నిమిషాల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్యం గెలుచుకున్నాయి. పరుగు చివరి దశలో విద్య రామరాజ్ అద్భుత ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపారు. ఈ క్రీడల్లో విద్యకు ఇది మూడో పతకం కావడం విశేషం. మరోవైపు మిక్స్‌డ్ రిలేలో గురిందెర్వీర్ సింగ్, అనిమేష్ కుజూర్, స్నేహ, హరిత బృందం కాంస్యం సాధించగా, మహిళల హైజంప్‌లో పూజ కాంస్య పతకం గెలుచుకుంది.





# రజినీకాంత్ 'ధర్మన్'లో రామ్ పోతినేని..

## వైరల్ ఫొటోతో క్లారిటీ?

**హైదరాబాద్, సెప్టెంబరు 29 :** సూపర్‌స్టార్ రజినీకాంత్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని అభిమానులను ఆకట్టుకునే వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'ధర్మన్'లో రామ్ పోతినేని కూడా నటిస్తున్నారనే ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. ఇప్పటివరకు దీనిపై అధికారిక ప్రకటన లేకపోయినా.. తాజాగా హీరోయిన్ రాశీ ఖన్నా పంచుకున్న ఓ ఫొటో ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. 'ధర్మన్' మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను రాశీ ఖన్నా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అందులో రజినీకాంత్, రాశీ ఖన్నాతో పాటు రామ్ పోతినేని కూడా కనిపించారు. అయితే ఆ ఫొటోను కొద్దిసేపటికే తొలగించినట్లు తెలుస్తోంది. అప్పటికే అభిమానులు దాన్ని భద్రపరచి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో వైరల్‌గా మారింది. ఈ ఫొటో బయటకు రావడంతో 'ధర్మన్'లో రామ్ పోతినేని నటిస్తున్నారనే ప్రచారానికి మరింత బలం చేకూరింది. అయితే సినిమాలో ఆయన ఎలాంటి పాత్రలో కనిపించనున్నారనే విషయం మాత్రం తెలియాల్సి ఉంది. అతిథి పాత్రలో కనిపిస్తారా? కథలో కీలకమైన పాత్ర పోషిస్తారా? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిత్రబృందం మాత్రం ఇప్పటివరకు రామ్ పాత్రపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 'ధర్మన్' తెరకెక్కుతున్నట్లు సమాచారం. రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. రాశీ ఖన్నా, సిమ్రన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రామ్ పోతినేని కూడా సినిమాలో ఉన్నారనే ప్రచారం నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# బిడ్డను వదిలి తొలిసారి ప్రయాణం

## పరిణీతి చోప్రా భావోద్వేగ వ్యాఖ్యలు

ముంబయి, సెప్టెంబరు 29 : తల్లిగా మారిన తర్వాత ఎదురైన అనుభవాల గురించి బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కుమారుడు నీర్‌ను ఇంట్లో వదిలి తొలిసారి పని కోసం ప్రయాణించినప్పుడు తీవ్ర అపరాధ భావనకు గురయ్యానని తెలిపారు. ప్రసవం తర్వాత చాలా నెలల పాటు కుమారుడితోనే ఉన్నానని పరిణీతి చెప్పారు. తొలిసారి బిడ్డకు దూరంగా ప్రయాణిస్తున్న సమయంలో విమానంలో దాదాపు మూడు గంటల పాటు ఏడుస్తూనే ఉన్నానని వెల్లడించారు. ఆ ప్రయాణం తనకు సరిగ్గా గుర్తు కూడా లేదని భావోద్వేగంగా తెలిపారు. ఇంట్లో కుటుంబ సభ్యులు బిడ్డను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నప్పటికీ.. 'మీ బాబు ఎక్కడ?' అంటూ సమాజం నుంచి వచ్చే ప్రశ్నలు తల్లులపై మరింత మానసిక ఒత్తిడిని పెంచుతాయని పరిణీతి పేర్కొన్నారు. తల్లి అయిన తర్వాత పని, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యత సాధించడం అంత సులభం కాదని ఆమె వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. రాఘవ్ చద్దా, పరిణీతి దంపతులకు 2025 అక్టోబరు 19న కుమారుడు నీర్ జన్మించాడు. తల్లిగా మారిన తర్వాత కొంత విరామం తీసుకున్న పరిణీతి.. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'షక్: ట్రస్ట్ నో వన్'తో నటనలోకి తిరిగి వస్తున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణలో ఆమె ప్రస్తుతం బిజీగా ఉన్నారు.






# ఆమె డెడికేషన్‌కు త్రివిక్రమ్ ఫిదా!

హైదరాబాద్, సెప్టెంబరు 29 : విక్టరీ వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. తాజాగా విడుదలైన 'నారాయణమ్మ' పాటలో నటి డింపుల్ హయతి డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా.. ఈ పాట కోసం ఆమె చూపిన అంకితభావంపై దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'నారాయణమ్మ' జానపద శైలిలో సాగే ఉత్సాహభరితమైన గీతంగా రూపొందింది. ఇందులో డింపుల్ హయతి తన నృత్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాట చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా.. సన్నివేశాలు, నృత్య భంగిమలు పర్ఫెక్ట్‌గా వచ్చే వరకు ఆమె రిహార్సల్స్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. పాట విడుదల కార్యక్రమంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ డింపుల్ హయతి అంకితభావాన్ని ప్రశంసించారు. ఓ నటిగా పాత్రకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ఆమె చూపిన కష్టం తెలియజేస్తోందని అభినందించినట్లు సమాచారం. డింపుల్ నృత్యం, తెరపై ఆమె చూపించిన ఉత్సాహాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. డింపుల్ హయతిని కేవలం ప్రత్యేక గీతాల్లో కాకుండా సినిమాల్లోనూ చూడాలని ఉందంటూ త్రివిక్రమ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని పెంచాయి. దీంతో భవిష్యత్తులో తన దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో డింపుల్‌కు అవకాశం దక్కవచ్చనే చర్చ మొదలైంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వెంకటేశ్ మార్క్ కుటుంబ భావోద్వేగాలు, వినోదం, మాస్ అంశాలతో 'ఆదర్శ కుటుంబం' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'నారాయణమ్మ' పాటకు వస్తున్న స్పందనతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.

# నానితో జోడీగా మీనాక్షి చౌదరి..

నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. విభిన్న కథలను ఎంచుకుంటూ కొత్త దర్శకులతో కలిసి పనిచేస్తున్న ఆయన.. ఇప్పుడు 'ఓజీ' ఫేమ్ దర్శకుడు సుజీత్‌తో ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ చిత్రంలో నానికి జోడీగా మీనాక్షి చౌదరిని ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. మీనాక్షి చౌదరి ఇప్పటికే టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారు. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన ఆమె 'ఇచ్చట వాహనములు నిలుపరాదు'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 'హిట్: ది సెకండ్ కేస్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి చిత్రాల్లో నటించి మరింత గుర్తింపు సంపాదించారు. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ'లో నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు నాని సరసన నటించే అవకాశం కోసం ఆమెతో చిత్రబృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నాని--సుజీత్



సినిమా కథాంశంపై కూడా ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. యూకేలోని ఫుడ్ మాఫియా నేపథ్యంలో డార్క్ హ్యూమర్, యాక్షన్ అంశాల కలయికగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ ప్రపంచానికి సంబంధించిన కథలో నాని ఇప్పటివరకు కనిపించని విభిన్న పాత్రలో కనిపించనున్నారని టాక్. చెఫ్ నేపథ్యంతో పాటు గ్యాంగ్‌స్టర్ లక్షణాలు కలిగిన పాత్రలో నాని కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా కీలక పాత్రలో నటించనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. నాని, సుజీత్, పృథ్వీరాజ్ కాంబినేషన్‌కు తోడు మీనాక్షి చౌదరి కూడా భాగమైతే సినిమాపై ఆసక్తి మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మీనాక్షి చౌదరి ఎంపిక, పృథ్వీరాజ్ పాత్ర, టైటిల్ తదితర అంశాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాను 2027 వేసవిలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com